నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 హైదరాబాద్, మంగళవారం 19 మార్చి 2024 VIKARABAD

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

**అధికారులను ఆదేశించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



**శంషాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : పొరపాట్లకు తావులేకుండా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శంషాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా తగిన మౌలిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరుగకుండా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ సూచించారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లకుండా చెక్ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా మెడిసిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## పటిష్ట నిఘా

**లోక్ సభ ఎన్నికల దృష్ట్యా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు**

**నగదు, ఆభరణాలుంటే రసీదులు తప్పనిసరి : ఎస్పీ కోటిరెడ్డి**



**కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్**

వికారాబాద్, మార్చి 18 : లోక్ సభ ఎన్నికల దృష్ట్యా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాకు ఆనుకుని ఉన్న ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో ఇంటర్ స్టేట్ బార్డర్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని చంద్రకల్, కస్తూర్‌పల్లి, మైల్వార్, ఇందర్చేడ్, నవాంగి, కొత్లాపూర్, బొపునరం ప్రాంతాల్లో మొత్తం 7 చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు, గిఫ్ట్‌లు, వెండి, బంగారు ఆభరణాలు ఉంటే కచ్చితంగా రసీదులు ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు జిల్లావాసులు సహకరించాలని కోరారు.

## సార్వత్రిక సందడి

**సార్వత్రిక ఎన్నికల సమరానికి నగారా మోగడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని నాలుగు లోక్ సభ స్థానాల్లో ఎన్నికల సందడి షురూ అయ్యింది. ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల దిశగా సమాయత్తమవుతుండడంతో త్వరలో ప్రచార కోలాహలం నెలకొననున్నది. ఇప్పటికే కొన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో పలు కార్యక్రమాలతో ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మరోపక్క జిల్లా యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరం చేసింది.**

**-రంగారెడ్డి, మార్చి 18 (నమస్తే తెలంగాణ)**

**లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో రాజకీయ పార్టీల్లో కోలాహలం**

- టికెట్ల కేటాయింపులో నిమగ్నమైన ప్రధాన పార్టీలు
- కోడ్ అమలుపై అధికార యంత్రాంగం అప్రమత్తం



లోక్ సభ ఎన్నిలకు షెడ్యూల్ విడుదలవడంతో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించే పనిలో నిమగ్నమయ్యాయి. త్వరితగతిన అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసి ప్రచార పర్వంలోకి దిగాలని భావిస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రధాన ప్రత్యర్థులుగా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు బలమైన అభ్యర్థులను ఎన్నికల బరిలో నింపేందుకు కసరత్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఎన్నికల సమాయత్తంలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికల్లో లోటుపాట్లను విశ్లేషిస్తూ లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో నాలుగు ఎంపీ స్థానాలు ఉండడంతో అన్ని స్థానాలను గెలుచుకునే దిశగా పార్టీ నేతలతో పాటు కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. చేవెళ్ల లోక్ సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అధిష్టానం ప్రకటించగా, మహబూబ్‌నగర్ స్థానానికి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డినే ఖరారు చేసింది. అలాగే నాగర్ కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను రంగంలోకి దింపే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇక భువనగిరి స్థానానికి అభ్యర్థిని ప్రకటించే విషయంలో కేసీఆర్ ఆచితూచిగా వ్యవహరిస్తున్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా, పార్టీ శ్రేణుల మనోభావాలకు అనుగుణంగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలన్నదే అధినేత కేసీఆర్ వ్యూహంగా కనిపిస్తున్నది. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌కు డీకే అరుణను, భువనగిరికి బూర నర్సయ్యగౌడ్, నాగర్‌కర్నూల్‌కు సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు భరత్ ప్రసాద్ పేరును బీజేపీ అధిష్టానం ప్రకటించింది. అభ్యర్థులను ప్రకటించే విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనుకబడి ఉన్నది. చేవెళ్లకు అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఇంకా ఆ పార్టీలో సందిగ్ధత నెలకొన్నది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి అభ్యర్థిని ఖరారు చేసే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తున్నది. మహబూబ్‌నగర్ స్థానానికి వంశీచంద్ రెడ్డి పేరును ప్రకటించగా.. నాగర్‌కర్నూల్, భువనగిరి టికెట్ల విషయంలో సందిగ్ధత కొనసాగుతున్నది.

**ఎన్నికల నియమావళి అమలుపై జిల్లా యంత్రాంగం దృష్టి..**

లోక్ సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలను ముమ్మరం చేసింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటరు జాబితా సవరణ, ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియలలో వేగం పెంచింది. మరోపక్క ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఫ్లెక్సీల తొలగింపు, వాల్ రైటింగ్స్‌ను చెరిపివేయడంతోపాటు నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి రాజకీయ పార్టీల ప్రభావం కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో అనుసరించాల్సిన విధివిధానాలపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు. స్టాటిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగాయి. పార్టీల అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణం స్పందించడం తదితర వాటిపై ఆయా బృందాలు దృష్టి సారించనున్నాయి. నగదు రవాణాపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. రూ.50వేలకు పైబడి నగదు వెంట తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉండాలి. లేదంటే సీజ్ చేసి కోర్టులో అప్పగించనున్నారు.

## ప్రచార సభలకు అనుమతులు తీసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, మార్చి 18 : ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, అందుకోసం కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా రాజకీయ నాయకులు, అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్ బృందాలతోపాటు ఎంసీఎంసీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా లేదా సీ-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని సూచించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను తొలగించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, కరపత్రాల్లో ముద్రించే అంశాలకు సంబంధించి తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జడ్పీ సీఈవో సుధీర్, ఆర్డీవో వంశీ చంద్ర, ఎన్నిల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రమ్ము నీరు రూ.150

**జేఎన్ఎన్‌యూఆర్ఎంకాలనీలో నీటి సమస్య ఫలితం**



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 18 : జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నీటి సమస్య తీవ్రమైంది. 15 రోజులుగా నీరు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లవారు అందినకాడికి దండుకుంటున్నారు. ఒక్క డ్రమ్ము నీటిని రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## చేవెళ్లలో త్రిముఖ పోటీ

**బీఆర్ఎస్, బీజేపీ కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోరు**

**మరోసారి విజయం సాధించేందుకు గులాబీ పార్టీ పక్కా వ్యూహం**



- వరుసగా 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు
- ముచ్చటగా మూడోసారి విజయఢంకా మోగించేలా కార్యాచరణ
- గెలుపుపై అన్ని పార్టీల్లోనూ ధీమా..
- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కే బలమైన క్యాడర్

వికారాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై ఏ పార్టీ జెండా ఎగురనుందనేదానిపై జిల్లా అంతటా ఆసక్తికరంగా మారింది. చేవెళ్ల పార్లమెంట్ పీఠాన్ని దక్కించుకునేందుకు అన్ని పార్టీలు గెలుపు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈసారి ఇక్కడ త్రిముఖ పోటీ జరుగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వరుసగా రెండుసార్లు విజయం సాధించిన గులాబీ పార్టీ మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించేలా పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను రంగంలోకి దింపింది. ఒకరిద్దరు నాయకులు పార్టీ మారినా.. ఇప్పటికే బలమైన క్యాడర్ ఉన్న దృష్ట్యా గెలుపు బీఆర్ఎస్ పార్టీనే వరించనున్నదనే చర్చ జరుగుతున్నది. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అయితే ఆయన ఎంపీగా ఉన్న సమయంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఆపదొచ్చి కలిసేందుకుపోతే అపాయింట్‌మెంట్ ఉందా, ఇంటికి రావద్దంటూ బయటి నుంచే పంపించేవారని, కొండాను మళ్లీ గెలిపిస్తే ఆ తిప్పలు తప్పవనే ప్రచారం జరుగుతున్నది. అదేవిధంగా అనామకుడిని తీసుకొచ్చి ఎంపీగా గెలిపించిన బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'రంజిత్ రెడ్డి ద్రోహి.. ఈ దఫా ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.. డబ్బుతో చేవెళ్ల ప్రజలను కొనలేరంటూ' సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తుండడం గమనార్హం. ఒకవేళ రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇస్తే.. ఇప్పటికే టికెట్ ఆశించి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం రంజిత్ రెడ్డికి మద్దతివ్వరనే ప్రచారం కూడా జోరందుకున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు గట్టి షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

**2008లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటు..**

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2008లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైంది. అటు పట్టణ, ఇటు గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ దీన్ని ఏర్పాటు చేశారు. చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్‌లో పరిధిలో ఉన్నాయి. అయితే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి మొదటిసారి 2009లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఎస్.జైపాల్ రెడ్డి గెలుపొందారు. అనంతరం 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగించింది. 2014 ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, 2019 ఎన్నికల్లో గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎంపీలుగా గెలుపొందారు. కాగా, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 24,43,112 మంది ఓటర్లున్నారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి 14,317 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీకి 40.62 శాతం ఓట్లురాగా, కాంగ్రెస్ పార్టీకి 39.5 శాతం, బీజేపీకి 15.53 శాతం, నోటాకు 0.71 శాతం ఓట్లు వచ్చాయి.

**కాసానివైపే ప్రజలు..**

బీఆర్ఎస్ పార్టీ నుంచి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బరిలో దింపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు సేవాగుణం ఉన్న కాసానికే అన్ని వర్గాల ప్రజలు పట్టం కట్టే అవకాశాలున్నాయి. ముఖ్యంగా స్థానికుడు కావడంతోపాటు ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితుడు కావడంతో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమనే జరుగుతున్నది.



**సబితాఇంద్రారెడ్డి నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు సురభివాణిదేవి, ఎగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి తదితరులు**

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- చేవెళ్ల అభ్యర్థి జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం
- స్పష్టం చేసిన రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నివాసంలో సమావేశం

రంగారెడ్డి, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని నేతలు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. సోమవారం శ్రీనగర్ కాలనీలోని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నివాసంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తున్నదని, ఈసారి కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ప్రస్తుత ఎన్నికల్లో ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, ఆ ఇద్దరినీ ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని, కేసీఆర్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుని మళ్లీ బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని అన్నారు. త్వరలోనే పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామని, పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి సబితారెడ్డి కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, ఎగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సజావుగా 'పది' పరీక్ష

- రంగారెడ్డి జిల్లాలో 50,935 మందికి గాను 50,790 మంది హాజరు, 145 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు
- వికారాబాద్ జిల్లాలో 13,410 మందికి గాను 13,353 మంది హాజరు, 57 మంది గైర్హాజరు
- ఇరు జిల్లాల్లో 319 పరీక్షా కేంద్రాలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ



**శంకర్‌పల్లి బాయ్స్ హై స్కూల్‌లో..**

షాబాద్, మార్చి 18 : పదో తరగతి పరీక్ష సజావుగా జరిగింది. మొదటి రోజు సోమవారం రంగారెడ్డిజిల్లాలో మొత్తం 50,935 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 50,790 మంది విద్యార్థులు హాజరయ్యారు. 145 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు సంబంధిత విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 239 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు విద్యార్థుల కోసం మరో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12:30 గంటలకు నిర్వహించారు. ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన వారికి కూడా పరీక్ష రాసేందుకు అనుమతినిచ్చారు. మొదటి రోజు కావడంతో గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఏ రూంలో తమ నంబర్లు వేశారో చూసుకున్నారు. ఉపాధ్యాయులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి విద్యార్థులను లోపలికి పంపించారు. జిల్లాలోని ఆయా పరీక్షా కేంద్రాలను డీఈవో సుశీందర్‌రావు సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

**సీసీ కెమెరాల పర్యవేక్షణలో..**

జిల్లా విద్యాశాఖ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పదో తరగతి పరీక్షలు నిర్వహించింది. ప్రతి పరీక్షా కేంద్రానికి ఓ చీఫ్ సూపరింటెండెంట్, ఓ డిపార్ట్‌మెంటల్ అధికారిని, జిల్లావ్యాప్తంగా 2,450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రానికి ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో సెంటర్లకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు.

**వికారాబాద్ జిల్లాలో..**

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. జిల్లాలో మొత్తం విద్యార్థులు 13,410 మంది విద్యార్థులకుగాను 13,353 మంది హాజరు కాగా, 57 మంది గైర్హాజరు అయ్యారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని 08416-235245ను సంప్రదించవచ్చు.



**వికారాబాద్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు**